సాక్షి నిర్మల్

సోమవారం ; 25 ; మార్చి ; 2024



ఉద్యోగార్థులపై ఫీజు భారం

టెట్ పరీక్ష ఫీజు పెంచడంపై ఉపాధ్యాయ ఉద్యోగార్థులు మండి పడుతున్నారు. పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ 6:29	మంగళ : 4:53

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38.0 /27.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. జిల్లాలో పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

కోదండరామ్ పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న కోదండరామ్

ఖానాపూర్: ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన అలేఖ్య కుటుంబాన్ని టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోదండరామ్ ఆదివారం పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలోని ఆమె నివాసంలో పరామర్శించారు. నిందితులకు వెంటనే కఠిన శిక్ష పడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. ఈ ఘటనలో గాయపడ్డ జయశీల ఆరోగ్య పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి నందిరామయ్య, మానవహక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు భుజంగరావు, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు తిలక్‌రావు, విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఉన్నారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి

నిర్మల్‌టౌన్: జిల్లా ప్రజలు హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ డాక్టర్ షర్మిల జానకి ఓ ప్రకటనలో తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, మైనర్లకు వాహనాలివ్వొద్దని సూచించారు. జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

గజ్జలమ్మ దేవికి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, పల్లకీసేవ నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


గురుకులంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్



నియామకపత్రాలతో విద్యార్థులు, ప్రతినిధులు

సారంగాపూర్: మండలంలోని చించోలి(బీ) గ్రామ సమీపంలోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో ఎంఎస్ఎన్ ల్యాబోరేటరీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు ఆదివారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ కళాశాలల్లో ఇటీవలే ఎంపీసీ, బైపీసీ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన 35మంది విద్యార్థులు హాజరయ్యారు. కంపెనీ ప్రతినిధులు 35మందికి ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపికైన ఆరుగురికి ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు. ఇందులో నిర్మల్ మైనార్టీ గురుకులం నుంచి షోయబ్ అక్తర్ ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా గురుకులాల సమన్వయ కర్త శ్రీధర్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కంపెనీ ప్రతినిధులు, గురుకుల సిబ్బంది అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ ఫిరోజ్, జిల్లా అకాడమిక్ కోఆర్డినేటర్ హమీద్, సిబ్బంది ఉన్నారు.

ఔషధాల ధరలు తగ్గించాలి



కేక్ కట్ చేస్తున్న యూనియన్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఫార్మా రంగంలోని ఔషధ ధరలు తగ్గించాలని తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ విద్యాసాగర్ కోరారు. యూనియన్ జిల్లా శాఖ ఆవిర్భావ సభను ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విద్యాసాగర్ హాజరు కాగా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సంతోష్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడారు. యూనియన్ తరఫున 60 ఏళ్లుగా సమాజ హితం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక

యూనియన్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బీ ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఆఫీస్ బేరర్స్‌గా ప్రమోద్, శ్రావణ్, సందీప్, విజయ్‌కాంత్‌తో పాటు ఎనిమిది మంది సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జోరుగా బెట్టింగ్..!

- ఐపీఎల్ వేళ రంగంలోకి నిర్వాహకులు
- రూ.లక్షలు చేతులు మారుతున్న వైనం
- ఆన్‌లైన్ ద్వారానే అన్ని లావాదేవీలు
- అరికట్టాలంటున్న జిల్లావాసులు



భైంసాటౌన్: క్రికెట్ ఆటపై యువతలో క్రేజ్ అంతాఇంతా కాదు. మ్యాచ్ జరుగుతున్నంత సేపు ఉత్కంఠగా చూస్తుంటారు. తమ అభిమాన జట్టు విజయం సాధిస్తుందంటే, తమ జట్టే గెలుస్తుందంటూ బెట్టింగ్ కాస్తుంటారు. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ నడుస్తోంది. దీంతో జిల్లాలో బెట్టింగ్‌రాయుళ్లు రంగంలోకి దిగారు. క్రికెట్‌పై మోజు ఉన్న యువత, వ్యక్తులను టార్గెట్ చేసుకుని వారిని బెట్టింగ్‌లోకి దింపుతున్నారు. జిల్లాలోని భైంసా, నిర్మల్, ఖానాపూర్ తదితర పట్టణాలతో పాటు మండలాల్లోనూ బెట్టింగ్‌దందా గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది. క్రికెట్ మ్యాచ్ జరుగుతున్న సమయంలోనే ఫోన్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఫోన్ పే, గూగుల్ పే ద్వారా రూ.వెయ్యి నుంచి రూ.లక్ష వరకు డబ్బులు పంపుతూ బెట్టింగ్ పెడుతున్నారు. కొందరు నగదు రూపంలో బెట్టింగ్ నిర్వహిస్తుండగా, మరికొందరు ఆన్‌లైన్‌లోనే లావాదేవీలు నిర్వహిస్తున్నారు.

అంతా ఫోన్ ద్వారానే..

గతంలో ఐపీఎల్, ఇతర బెట్టింగ్‌ల కోసం ముంబై, నాందేడ్, హైదరాబాద్ లాంటి నగరాలకు చెందిన వారే ప్రధాన బుకీలుగా ఉండేవారు. ప్రస్తుతం పట్టణాలు, గ్రామాలకూ విస్తరించారు. బెట్టింగ్ కాయాలనుకునేవారు ముందుగా బుకీలకు డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. ఫోన్ పే, గూగుల్ పే ద్వారా నగదు పంపిస్తే వారు ఆ వ్యక్తి కాసిన జట్టుపై బెట్టింగ్ నమోదు చేసుకుంటారు. ఒకవేళ బెట్టింగ్‌లో గెలిస్తే గెలిచిన మొత్తాన్ని బుకీ నుంచి నేరుగా, లేదా ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా తీసుకుంటారు. అయితే ఈ వ్యవహారమంతా ఫోన్ ద్వారానే జరుగుతుండడం గమనార్హం. మ్యాచ్‌లు జరుగుతున్న సమయంలో బెట్టింగ్‌లకు పాల్పడే వారు ఫోన్లతో రహస్య ప్రాంతాల్లో మకాం వేసి బెట్టింగ్‌లు పెడుతున్నారు. మ్యాచ్‌లో ఎవరు గెలుస్తారనే దానితోపాటు ప్రతీ బాల్‌కు రన్‌పై, వికెట్‌పై కూడా బెట్టింగ్ పెడుతున్నారు. గెలిచినా, ఓడినా ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరుపుతున్నారు.

యువతే ఎక్కువ..

ఐపీఎల్ బెట్టింగ్‌కు దిగుతున్నది ఎక్కువగా యువతే కావడం గమనార్హం. సరదా కోసమో, త్వరగా డబ్బు సంపాదించవచ్చన్న ఆశతోనో చాలామంది ఈ వ్యసనంలో చిక్కుకుంటున్నారు. రూ.100, రూ.200తో ప్రారంభించి రూ.వేలల్లో కాసే స్థితికి వెళ్తున్నారు. బెట్టింగ్ నిర్వాహకులు కూడా ఇలాంటి వారినే లక్ష్యంగా చేసుకుని వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి సభ్యులుగా చేర్చుకుంటున్నారు. మ్యాచ్‌ల వివరాలు పోస్ట్ చేస్తూ గెలిస్తే రెట్టింపు లాభం వస్తుందని ఆశ పెడుతూ ఇందులోకి లాగుతున్నారు. బెట్టింగ్‌కు అలవాటుపడినవారిలో బడా వ్యాపారులు, రాజకీయ నాయకుల పిల్లలే కాకుండా సామాన్య, మధ్య తరగతి వారు కూడా ఉంటున్నారు. బెట్టింగ్‌లో పోగొట్టుకున్న డబ్బును ఎలాగైనా తిరిగి గెలుచుకోవాలన్న ఉద్దేశంతో అప్పులు చేయడంతో పాటు ఇంట్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. నష్టపోయిన వారు తిరిగి చెల్లించలేక, ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకున్న ఘటనలున్నాయి. పరువు పోతుందని తల్లిదండ్రులు కూడా పోలీసు కేసుల వరకు వెళ్లకుండా మిన్నకుంటున్నారు. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో బెట్టింగ్‌రాయుళ్లపై పోలీసులు దృష్టి సారించి బెట్టింగ్‌ను అరికట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మాటకు కట్టుబడే పార్టీ కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, వేదికపై ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు, మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, నారాయణ్‌రావుపటేల్, డీసీసీ అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు

- ఎంపీ అభ్యర్థి గెలుపునకు కృషిచేయాలి
- కార్యకర్తలకు మంత్రి సీతక్క దిశానిర్దేశం
- పార్టీలో చేరిన విఠల్‌రెడ్డి అనుచరులు

భైంసాటౌన్: కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడే పార్టీ అని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల ముధోల్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే జీ విఠల్‌రెడ్డి అనుచరులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మంత్రి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, రూ.ఆరు లక్షల కోట్ల అప్పుల భారం ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. అధికారంలోకి వచ్చిన రెండునెలల్లోనే 30వేలకు పైగా ఉద్యోగాలిచ్చినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ కుటుంబ పార్టీ కాదని, దేశం కోసం త్యాగాలు చేసిన చరిత్ర పార్టీకి ఉందని తెలిపారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ అసహనంతో విమర్శలకు దిగుతోందని, మరోవైపు పదేళ్లలో ఎలాంటి అభివృద్ధి చేపట్టని బీజేపీ ఇంటింటికీ అక్షింతలు పంచుతూ దేవుడి పేరిట ఓట్లు దండుకోవాలని చూస్తోందని విమర్శించారు. దేశంలో ప్రతీ పదేళ్లకోసారి అధికార మార్పిడి ఖాయమని, ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా ఇంటింటికీ వెళ్లి ఆరు గ్యారంటీలు వివరిస్తూ లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ముధోల్ నియోజకవర్గంలో నారాయణ్‌రావుపటేల్, విఠల్‌రెడ్డి వర్గీయులు గ్రూపు రాజకీయాలకు పోకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మతాల మధ్య చిచ్చు పెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కోరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేస్తామని మాజీ ఎమ్మెల్యే బీ నారాయణ్‌రావు పటేల్ పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు, టికెట్ ఆశావహులు ఆత్రం సుగుణ, ఆత్రం భాస్కర్, నాయకులు సింధే ఆనంద్‌రావు, బాశెట్టి సాగరబాయి, సూర్యకాంత్ రెడ్డి, మురళీగౌడ్, సాయిలు, రమేశ్ మాశెట్టివార్, రాంచందర్‌రెడ్డి, బుచ్చన్న తదితరులున్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి పాటుపడాలి



ప్రశంసాపత్రాలు అందుకున్న కండక్టర్లు, డ్రైవర్లతో ఆర్ఎం సాలోమాన్

నిర్మల్‌టౌన్: ఆర్టీసీ ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి దోహదపడాలని ఆదిలాబాద్ ఆర్ఎం సాలోమాన్ సూచించారు. డిపోకు అత్యధిక ఆదాయం సమకూర్చిన కండక్టర్లు, డీజిల్ ఆదా చేసిన డ్రైవర్లను నిర్మల్ డిపోలో ఆదివారం సన్మానించారు. ప్రశంసాపత్రాలు, నగదు ప్రోత్సాహకాలు అందించారు. అనంతరం ఆర్ఎం మాట్లాడుతూ.. నిర్మల్ డిపోను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపాలని కోరారు. డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, సహాయ మేనేజర్లు రాజశేఖర్, నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ సమావేశానికి 'సోయం' గైర్హాజరు

- ఉమ్మడి జిల్లాలో సర్వత్రా చర్చ

కైలాస్‌నగర్: ఎంపీ ఎన్నికల ప్రచారానికి సంబంధించి బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించింది. పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నేతృత్వంలో నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి రాష్ట్రంలోని పదాధికారులందరినీ ఆహ్వానించారు. అయితే సమావేశానికి ఆదిలాబాద్ సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావు గైర్హాజరవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ప్రకటించిన బీజేపీ ఎంపీ అభ్యర్థుల్లో ఆదిలాబాద్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న సోయంకు చోటు దక్కలేదు. అప్పటి నుంచి ఆయన అసంతృప్తిగా ఉన్నారు. అలాగే పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఈక్రమంలో పార్టీ మారుతారనే ప్రచారం కూడా సాగుతోంది. ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ప్రచార సభలకు కూడా ఆయన గైర్హాజరయ్యారు. అయితే పార్టీ అధిష్టానం ఆయనను బుజ్జగించి నామినేటెడ్ పదవులపై భరోసా కల్పించిందని, ఈ నేపథ్యంలో ఆయన ఈ సమావేశాలకు హాజరవుతారని అంతా భావించారు. అయితే సోయం ఈ సమావేశానికి గైర్హాజరుకావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సోయం బీజేపీలో కొనసాగుతారా.. లేదంటే పక్క పార్టీలోకి వెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారా.. అనే దానిపై గుసగుసలు వినిపిస్తున్నాయి.

గత ప్రభుత్వ విధానాలతోనే సమస్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

నిర్మల్‌చైన్‌గేట్: గత ప్రభుత్వ విధానాలతోనే ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదని ప్రొఫెసర్ కోదండరామ్ ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ సంఘ భవనంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం ఉద్యోగులను పాలేర్లుగా భావించిందని విమర్శించారు. ఉద్యోగుల పనులనూ ప్రభుత్వమే చేయడంతో కాళేశ్వరం ప్రాజెక్ట్ సమస్యలో ఇంజినీర్లకు ఇబ్బందులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వానికి కొమ్ము కాస్తూ సంఘాలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని పూర్తిగా దెబ్బ తీశారన్నారు. సమస్యల సాధనకు సంఘాల పునరుద్ధరణ కీలకమన్నారు. ఇష్టానుసారంగా జిల్లాల విభజన, స్థానిక రిజర్వేషన్ల అమలు జరగక 317 జీవో సమస్యలు తలెత్తాయని పేర్కొన్నారు. హెల్త్ కార్డులు, సీపీఎస్ సమస్య, 317 జీవోపై వెంటనే చర్చ జరగాలన్నారు. ప్రభుత్వానికి, ఉద్యోగులకు ప్రజాస్వామ్య బద్ధమైన సంబంధం ఉండాలని, ప్రతీ ఉద్యోగ సంఘానికి ఒక బాధ్యత అప్పగించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

'డబుల్' కష్టాలు



మొదటి అంతస్తుకు బకెట్ లాగుతున్న లబ్ధిదారు



మహాలక్ష్మీవాడ నాగనాయిపేటలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలు

- వసతుల లేమితో లబ్ధిదారుల పాట్లు
- ఆర్నెళ్లుగా అసౌకర్యాల మధ్య జీవనం
- వేసవి కావడంతో తాగునీటి తండ్లాట



చేతిపంపు వద్ద క్యూలో మహిళలు

నిర్మల్ చైన్‌గేట్: డబుల్ బెడ్రూం ఇల్లు రానోళ్లు బాధ పడుతుండగా.. వచ్చినోళ్లు వాటిలో ఉండలేని పరిస్థితి నెలకొంది. ఇళ్లు పొందినవారిలో కొందరు ఇప్పటికే వెళ్లి ఉంటుండగా.. కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కోబ్లాక్‌లో ఒక్కో సమస్య ఉంది. సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలోని మహాలక్ష్మీవాడ నాగనాయిపేట సమీపంలో నిర్మించి పేదలకు పంపిణీ చేసిన డబుల్ బెడ్రూం ఇళ్లలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. 1,015 డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించి ఆరునెలలు గడుస్తోంది. ఇప్పటివరకు తాగునీటి వసతి కల్పించలేదు. అంతర్గతరోడ్లు అంతంతే. మురుగు కాలువలు, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి.

చేతిపంపే దిక్కు..

నాగనాయిపేట సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్రూంల లబ్ధిదారులకు తాగునీటి సమస్య ఉంది. 42 బ్లాకులకు మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు. ఏదైనా కారణం చేత నీరు సరఫరా చేసే పైపులు పాడైతే డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రాంగణంలోని చేతిపంపే వీరికి దిక్కవుతోంది. కనీసం నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్ వేసిన మూడు బోర్లకు మోటార్లు బిగించినా సమస్య కొంతవరకు పరిష్కారమయ్యేదని లబ్ధిదారులు చెబుతున్నారు.

సగానికి పైగా ఖాళీ..

గత ప్రభుత్వం 1,015 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్రూంలు పంపిణీ చేసి పట్టాలు అందజేసినా మౌలిక వసతులు లేక 400 మంది మాత్రమే నివాసముంటున్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించినా నిర్వహణ లోపంతో అవి నిరుపయోగమయ్యాయి. దీంతో కాలనీవాసులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఎవరూ పట్టించుకుంటలేరు



గ్రీవెన్స్‌లో పలుసార్లు కలెక్టర్‌ను కలిసి డబుల్ బెడ్రూం కాలనీలోని సమస్యలు వివరించాం. వెంటనే పరిష్కరించాలని కోరాం. ఇప్పటివరకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వెంటనే సమస్యలు పరిష్కరించకుంటే త్వరలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తాం.

– రవి, స్థానికుడు

కందకం పూడ్చాలి



మా బ్లాకు పక్కనే కందకం ఉంది. డబుల్ బెడ్రూం ఇళ్ల నుంచి వెలువడే మురుగు నీరంతా కందకంలోకి వచ్చి చేరుతోంది. కందకంలో మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో వ్యాధుల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి కందకం పూడ్చివేయాలి.

– సదాలక్ష్మి, లబ్ధిదారు

నీటి సౌకర్యం లేక అవస్థలు



ఆరు నెలలుగా సీ–2 బ్లాక్‌లో నీటి సరఫరా జరగడం లేదు. తాగేందుకు మంచినీరు లేదు. కనీసం కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాం. నీటి కోసం చుట్టుపక్కల వారిని అడగాల్సి వస్తోంది. ఏకంగా మూడు ఫ్లోర్ల పైకి నీటిని మోసుకెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– రమేశ్, లబ్ధిదారు

వసతులు కల్పించాలి



గత ప్రభుత్వం డబుల్ బెడ్రూంలు పంపిణీ చేసినా కాలనీలో కనీస వసతులు కల్పించలేకపోయింది. ఇక్కడ నివాసముండేందుకు నానా పాట్లు పడుతున్నాం. సమస్యలతో నిత్యం సతమతమవుతున్నాం. అధికారులు స్పందించి వసతులు కల్పించాలి. మా ఇబ్బందులు తీర్చాలి.

– సుజాత, స్థానికురాలు

కోదండరామ్‌ను కలిసిన స్వీపర్లు

కడెం: జిల్లాలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లు ఆదివారం ఖానాపూర్‌లో టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను కలిశారు. సమస్యలు పరిష్కరించేలా చొరవ చూపాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఏళ్లుగా చాలీచాలని వేతనంతో పని చేస్తున్నామని ఆవేదన వ్యక్తంజేశారు. సేవలు గుర్తించి ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసేలా చూడాలని కోరారు. కోదండరామ్‌ను కలిసినవారిలో స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ హుస్సేన్, స్వీపర్లు సత్తెన్న, లక్ష్మణ్, రాజన్న, రాజయ్య తదితరులున్నారు.



కోదండరామ్‌కు వినతిపత్రం ఇస్తున్న స్వీపర్లు

క్లుప్తంగా

రామప్పను సందర్శించిన న్యాయమూర్తులు



సందీశ్వరుని వద్ద జడ్జిలు

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలంలోని రామప్ప దేవాలయాన్ని ఆదివారం ములుగు, కరీంనగర్, నిర్మల్, మెదక్, మహబూబాబాద్, కామారెడ్డి జిల్లాల జడ్జిలు లలిత శివజ్యోతి, బి.ప్రతిమ, ఎ.కర్ణాకుమార్, పి.లక్ష్మీశారద, పి.చంద్రశేఖరప్రసాద్, ఎస్.శ్రీదేవి సందర్శించారు. శ్రీరామలింగేశ్వరస్వామికి పూజలు అనంతరం వారికి పూజార్లు తీర్థప్రసాదాలు అందజేశారు. తర్వాత నందీశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయ శిల్పాకళాసంపద గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించారు.

నిర్మల్ వాసికి అరుదైన గౌరవం



కళాఖండాలను ప్రదర్శిస్తున్న రాజేంద్ర

నిర్మల్‌ఖిల్లా: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో కళాక్షేత్ర శిల్పకళాశాలలో నిర్వహించిన 'శ్రీ వెంకటేశ్వర చిత్రార్చన పుస్తకావిష్కరణ'కార్యక్రమంలో నిర్మల్ జిల్లావాసి, సూక్ష్మ చిత్రకళా నిపుణుడు, ఆర్టిస్టు బిట్లింగు రాజేంద్రకు అరుదైన గౌరవం లభించింది. ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్యక్రమంలో రాజేంద్ర పలు కళాఖండాలు, శ్రీ వేంకటేశ్వరస్వామి చిత్రాలను సూక్ష్మచిత్ర రూపంలో ప్రదర్శించారు. అనంతరం ఆయన్ను అభినందించి, ప్రశంస పత్రాన్ని అందించారు. ప్రముఖ చిత్రకారులు ఏలే లక్ష్మణ్, శేష బ్రహ్మం, మృత్యుంజయ రావు, న్యాయనిర్ణేతలు తదితరులు ఉన్నారు.

వాలీబాల్ కోర్టు ఏర్పాటుకు రూ.40 వేలు..?

ఆదిలాబాద్‌రూరల్: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతీ గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. మండలంలోని కొన్ని పంచాయతీల్లో క్రీడా పరికరాలు సమకూర్చగా మరికొన్ని జీపీల్లో కొన్ని మాత్రమే ఏర్పాటు చేసింది. ఇంకొన్ని జీపీల్లో పంచాయతీ నిధులతో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే వాలీబాల్ క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చవుతుందని స్పోర్ట్స్ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల గ్రామంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ క్రీడా ప్రాంగణానికి రూ.40 వేల వ్యయం చేసినట్లు పంచాయతీ కార్యదర్శి చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఆ నిధులు సంబంధించి ఆడిట్ పూర్తయిందని ఆయన 'సాక్షి'తో తెలిపారు.

కారు, బైక్ ఢీ

- ఒకరు మృతి
- ఇద్దరికి తీవ్ర గాయాలు

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి వంతెన వద్ద కారు, బైక్ ఢీకొన్న ఘటన ఒకరి మృతిచెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై రాజు కథనం ప్రకారం..బిహార్ రాష్ట్రం చెప్పరాన్ జిల్లా మాత్‌టోణి గ్రామానికి అభిషేక్‌కుమార్, జితేందర్, రోహిత్‌కుమార్‌లు భైంసా మండలం మాటేగాంలోని రైస్‌మిల్‌లో హమాలీ కూలీలుగా పని చేస్తున్నారు. శనివారం రాత్రి పని ముగించుకుని ముగ్గురు బైక్‌పై నందిపేట్‌కు బయల్దేరారు. రాము నిజామాబాద్ నుంచి లోకేశ్వరంలోని తన ఇంటికి కారులో వస్తుండగా బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో అభిషేక్‌కుమార్ (20) అక్కడిక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయాలైన జితేందర్, రోహిత్‌కుమార్‌ను 108లో భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. రైస్‌మిల్ యాజమాని మహేందర్‌రెడ్డి ఫిర్యాదుతో ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233900]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ. 18K. ఫోన్: 9640468899 / 9640258899 [H-799856]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,

ఉపాధ్యాయ ఉద్యోగార్థులపై ఫీజుల భారం!

నిర్మల్ జిల్లా కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీకి చెందిన రమేశ్ డీఎడ్, బీఎడ్ శిక్షణ పూర్తి చేసుకుని నాలుగేళ్లుగా ఉపాధ్యాయ ఉద్యోగానికి ప్రిపేరవుతున్నాడు. ఇటీవల డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలై దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఇదే తరుణంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రకటన కూడా విడుదలైంది. దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఇతను ప్రైవేటు ఉద్యోగం మానేసి పూర్తి స్థాయిలో ఉద్యోగం కోసం సన్నద్ధమవుతున్న దశలో దరఖాస్తుల కోసం వేలాది రూపాయలు వెచ్చించాల్సి రావడం పెనుభారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇది ఇతనొక్కడి పరిస్థితే కాదు. ఉమ్మడి జిల్లాలోని 35 వేల మంది పరిస్థితి ఇంతే..

- టెట్ ఒక్కో పేపర్‌కు వెయ్యి రూపాయలు
- డీఎస్సీకి మరో వెయ్యి...
- తగ్గించాలని కోరుతున్న అభ్యర్థులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 35 వేల మంది..

నిర్మల్‌ఖిల్లా: దాదాపు ఏడేళ్ల తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం టెట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. డీఎస్సీ దరఖాస్తుల ప్రక్రియ కూడా ప్రారంభమైంది. అయితే పరీక్ష ఫీజు ఒక్కో పేపర్ కు రూ.వెయ్యి నిర్ణయించడంపై అభ్యర్థులు మండిపడుతున్నారు. జిల్లా యూనిట్‌గా నియమితులయ్యే ఉపాధ్యాయ ఉద్యోగం కోసం కొన్నేళ్లుగా తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రైవేటు రంగాల్లో ఉపాధి, ఉద్యోగావకాశాలు మానుకుని గ్రంథాలయాల్లో సన్నద్ధమవుతుండగా దరఖాస్తు ఫీజులు పెనుభారంగా మారాయని అభ్యర్థులు వాపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మంది అభ్యర్థులు పేద దిగువ మధ్యతరగతి కుటుంబాల వారే ఉన్నారు. బీఎడ్, డీఎడ్ శిక్షణ పూర్తి చేసుకుని ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో డీఎస్సీ టెట్ పరీక్షల ఫీజు తగ్గించాలని బీఎడ్, డీఎడ్ అభ్యర్థుల సంఘం నాయకులు ఆనంద్‌బాబు, తిరుమలేశ్, గజేందర్, ఎజాస్, తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేశారు.



పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు

డీఎస్సీలో ఒక్కో పరీక్షకు రూ.వెయ్యి


డీఎస్సీలో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ వివిధ సబ్జెక్టుల్లో పరీక్షలు ఉంటాయి. ఒక్కో అభ్యర్థి డీఎడ్, బీఎడ్ పూర్తి చేసిన వారు ఉన్నారు. ఎస్జీటీ పరీక్షకు రూ.వెయ్యి, స్కూల్ అసిస్టెంట్ ఒక్కో సబ్జెక్టుకు రూ.వెయ్యి ఉండడంతో ఒక్కో అభ్యర్థి దాదాపు రెండు నుండి మూడు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. దీంతో దరఖాస్తు చేసుకోవడానికి దాదాపు రూ.3 వేలకు పైగా ఖర్చు అవుతుందని వాపోతున్నారు. ఇప్పటికే కొన్నేళ్లుగా ప్రైవేటు ఉద్యోగాలు వదిలేసి గ్రంథాలయాలకే పరిమితమవుతూ పరీక్షలకు సన్నద్ధమవుతున్న సందర్భంలో ఈ పరీక్ష ఫీజులు భారీగా పెంచడంపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్ పరీక్షల హాజరూ భారమే...

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్), ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ)లను ఇకనుంచి ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ఈ పరీక్షలు ఆఫ్‌లైన్‌లో ఆయా జిల్లా కేంద్రాల్లోనే నిర్వహించేవారు. కానీ ప్రస్తుతం ఈ పరీక్షలు రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, జిల్లా కేంద్రాల్లో నిర్వహించాల్సి ఉంటుంది. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, తదితర సుదూర ప్రాంతాలకు జిల్లా అభ్యర్థులు వెళ్లి పరీక్ష రాయాల్సి ఉంటుంది. దూరభారంతో అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావడానికి కూడా ప్రయాణ ఖర్చులు తడిసి మోపెడు కానున్నాయి.

టెట్ పరీక్ష అంతే...

రాష్ట్ర ప్రభుత్వం టెట్ పరీక్షకు సంబంధించిన సమగ్ర నోటిఫికేషన్‌ను శుక్రవారం విడుదల చేసింది. ఈ మేరకు ఆన్‌లైన్‌లో అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించింది. ఇటీవల డీఎడ్, బీఎడ్ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులతో పాటు గతంలో టెట్ అర్హత సాధించి ఎక్కువ మార్కుల కోసం పరీక్ష రాయాలనుకునే అభ్యర్థులు మళ్లీ ఈసారి కూడా టెట్ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ దరఖాస్తుల ప్రక్రియ ఈనెల 27 నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభం కానుంది. గతంలో టెట్ పరీక్షకు ఒక పేపర్‌కు రూ.200, రెండు పేపర్లకు రూ.300 ఫీజుగా ఉండేది. ఈసారి ఈ ఫీజులను దాదాపు 80 శాతం పెంచారు. ఒక్క పేపర్‌కు రూ.వెయ్యి, రెండు పేపర్లకు రూ.2 వేలకు పెంచారు. నిరుద్యోగులకు పెనుభారంగా పరిణమించిన ఈ దరఖాస్తు ఫీజులను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని అభ్యర్థులు కోరుతున్నారు.


16. HALL TICKET
17. EXAM FEE:
18. PROCEDURE FOR ONLINE SUBMISSION OF APPLICATION

టెట్ ఫీజు రూ.వెయ్యిగా నిర్ణయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్

పునరాలోచన చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం టెట్, డీఎస్సీ పరీక్ష ఫీజులు వెంటనే తగ్గించాలి. టెట్, డీఎస్సీ పరీక్షలకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉండడంతో కేవలం దరఖాస్తులకే వేలాది రూపాయలు వెచ్చించాల్సి రావడం కష్టమవుతోంది. ఈ ఫీజులపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– నబ్బని మురళి, అభ్యర్థి, నిర్మల్

దరఖాస్తులకే రూ.5 వేలు



డీఎడ్, బీఎడ్ పూర్తి చేసిన నాలాంటి అభ్యర్థులకు టెట్ పేపర్ 1, పేపర్ 2 పరీక్షలకు కలిపి రూ.2 వేలు, డీఎస్సీలో ఎస్జీటీ కోసం రూ.వెయ్యి, స్కూల్ అసిస్టెంట్ సబ్జెక్టు, లాంగ్వేజ్ కలిపి రూ.2 వేలు మొత్తం రూ.5వేల వరకు దాదాపు దరఖాస్తులకే అవుతోంది.

– తక్కలపల్లి సునీల్‌కుమార్, అభ్యర్థి, నిర్మల్

బాసరలో మంత్రి సీతక్క పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న సీతక్క

ముధోల్: బాసర సరస్వతి అమ్మవారిని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి మాజీ ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, నారాయణ్‌రావుపాటిల్ స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అతకుముందు బాసరలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సీతక్క సమావేశం నిర్వహించారు. మంత్రివెంట ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, నాయకులు ఉన్నారు.

కదిలి పాపహరేశ్వరాలయంలో..

దిలావర్‌పూర్: మండలంలోని శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వర స్వామిని ఆదివారం రాష్ట్ర మంత్రి సీతక్క దర్శించుకున్నారు. అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. మంత్రికి ఆలయ పరిసరాలు, విశిష్టతను అర్చకులు వివరించారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, కాంగ్రెస్ నాయకులు ఆత్రం సుగుణ, ఆత్రం భాస్కర్, నాయకులు రాజారెడ్డి, రమణ, విద్యాసాగర్‌రెడ్డి, పరుశురాం, ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రావు పాటిల్ ఉన్నారు.

జాతీయస్థాయిలో సత్తాచాటాలి

ఉట్నూర్‌రూరల్: న్యూఢిల్లీలో జరిగే జాతీయ సీనియర్ బాలుర ఖోఖో పోటీల్లో రాణించి సత్తాచాటాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.దిలీప్‌కుమార్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ మైదానంలో రాష్ట్ర జట్టు శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. సీనియర్ క్రీడాకారులు, ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థుల మధ్య జరిగిన పోటీని తిలకించారు. జాతీయ, అంతర్జాతీయ ఖోఖో పోటీల్లో పతకాలు సాధించిన రాజేందర్, సురేశ్, సుధాకర్, కోచ్ శివకృష్ణను సన్మానించారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఏటీడీవో క్రాంతి పాల్గొన్నారు.

దోచుకోవడం.. దాచుకోవడమే బీఆర్ఎస్ పాలన

- కేసీఆర్ అవినీతికి నిలువెత్తు నిదర్శనం కాళేశ్వరం
- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్

ఖానాపూర్: దోచుకోవడం దాచుకోవడమే లక్ష్యంగా పదేళ్ల బీఆర్ఎస్ పాలన సాగిందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. పట్టణంలోని జేకే ఫంక్షన్‌హాల్‌లో జిల్లా అధ్యక్షుడు తిలక్‌రావు అధ్యక్షతన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పార్లమెంట్ సన్నాహక సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ అవినీతికి నిలువెత్తు నిదర్శనంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులు నిలిచాయన్నారు. కేంద్రప్రభుత్వ గుర్తింపు పొందిన జాతీయస్థాయిలోని స్వతంత్ర సంస్థ ఆడిటింగ్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు ప్రణాళిక, అమలు సరిగాలేదని, నిధుల వినియోగం సక్రమంగా లేదని చెప్పిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన కంపెనీ నుంచి కేసీఆర్ అందినకాడికి దండుకున్నారని విమర్శించారు. అవసరానికంటే అదనంగా ఖర్చు చేసి పనులు చేపట్టారన్నారు. రాష్ట్రంలో ఎన్నో ప్రాజెక్టులు దశాబ్దాల క్రితం కట్టారని అవన్నీ నేటికి చెక్కు చెదరకుండా ఉన్నాయని కేసీఆర్ కట్టిన కాళేశ్వరం పనులు మాత్రం ఆదిలోనే పునాదులు కదులుతున్నాయన్నారు. కొట్లాడి తెచ్చిన రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలనతో అవినీతి పెరిగిపోయిందన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యం

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా టీజేఎస్ శ్రేణులు పనిచేయాలని కోదండరామ్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్ అభివృద్ధి చేసేలా ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలతోపాటు గిరిజన వర్సిటీ ఏర్పాటు చేసి పోడు భూములు, డీ 27, డీ28 కాలువల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. అంతకముందు నాయకులు కోదండరామ్‌ను సన్మానించారు. పార్టీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు సర్దార్ వినోద్, దుర్కు, గోనె శ్రీనివాస్, బెనహర్ సిరాజ్, రాజేశ్వర్‌రెడ్డి, లింగన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోదండరామ్

నిర్వహణ లేకనే 'కడెం'కు ప్రమాదం

కడెం: కడెం ప్రాజెక్ట్ నిర్వహణను గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే ప్రమాదం నెలకొందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ విమర్శించారు. కడెం ప్రాజెక్టును ఆదివారం ఆయన సందర్శించారు. వరద గేట్ల మరమ్మతు పనులను పరిశీలించారు. రాష్ట్రంలో హైదరాబాద్ ఇంజినీర్లు మొదట కట్టిన ప్రాజెక్టుల్లో కడెం ఒకటన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ ఏర్పడిన తర్వాత కడెంను పట్టించుకోకపోవడంతో డేంజర్ జోన్‌లోకి వెళ్లిందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, మరమ్మతు చేయిస్తోందని తెలిపారు. కడెం ప్రాజెక్ట్‌కు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఎగువన కుప్టి ప్రాజెక్టు నిర్మిస్తే ఆయకట్టును స్థిరీకరించవచ్చని పేర్కొన్నారు. ప్రాజెక్టు ఆధునికీకరణ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఆయన వెంట టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు తిలక్‌రావు ఉన్నారు.

కుస్తీపోటీలకు C/O బజార్‌హత్నూర్

- 80 ఏళ్లుగా నిర్వహణ
- హోలీ సందర్భంగా నేడు పోటీలు
- పాల్గొననున్న మల్లయోధులు

బజార్‌హత్నూర్: గత 80 ఏళ్లుగా కుస్తీ పోటీలకు కేరాఫ్‌గా బజార్‌హత్నూర్ నిలుస్తోంది. హోలీ సందర్భంగా పాతికేళ్లుగా వీటిని నిర్వహిస్తున్నారు. తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి మల్లయోధులు పాల్గొని సత్తాచాటుతున్నారు. హోలీ సందర్భంగా నిర్వహిస్తున్న కుస్తీ పోటీలపై సాక్షి కథనం.

ప్రతి ఏటా..

బజార్‌హత్నూర్ గ్రామం దేశ స్వాతంత్రం కంటే ముందు ఆవిర్భవించింది. గ్రామంలోని అన్ని కుటుంబాలు పశ్చిమ మహారాష్ట్ర నుంచి వలసవచ్చాయి. నిజాం కాలంలో (మహారాష్ట్ర మాజీ సీఎం విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ మామ) దివంగత పల్సికర్ రంగారావు ఈ ప్రాంతానికి సంస్థానదీశులుగా ఉండేవారు. ఆయన ప్రోద్బలంతో అక్కడి ప్రజలు ఈ ప్రాంతానికి వచ్చి దట్టమైన అడవులను చదునుచేసి సాగులోకి తీసుకువచ్చారట. 14 వేల ఎకరాల సాగు భూమి ఆయన ఆధీనంలో ఉండేది. మహారాష్ట్రలోని కొంత ప్రాంతాన్ని (కుభీర్ మండలం పల్సి గ్రామంలో అతని నివాసం) హైదరాబాద్ రాష్ట్రం ఏర్పడ్డాక విలీనం చేశారు. తర్వాత సంస్థానాన్ని వదులుకుని రాజకీయంగా అడుగులు వేసి ఆదిలాబాద్ జిల్లాకు తొలి జెడ్పీచైర్మన్ పదవి చేపట్టాడు. ఆయన ద్వారా పరిచయమైన మహారాష్ట్ర సంప్రదాయమైన కుస్తీ పోటీలు బజార్‌హత్నూర్‌లో ఏటా నిర్వహించడం ఆనవాయితీగా మారింది.



తలపడుతున్న మల్లయోధులు (ఫైల్)

తలపడనున్న కుస్తీయోధులు

కుస్తీ పోటీల్లో మల్లయోధులు పాల్గొననున్నారు. ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల బజార్‌హత్నూర్, బోథ్, ఇచ్చోడ, గుడిహత్నూర్ తదితర మండలాల నుంచి మల్లయోధులు రానున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్, యవత్మాల్, కిన్వట్, లాతూర్, చంద్రాపూర్ జిల్లాల నుంచి వారు పాల్గొనున్నారు.

నేడే పోటీలు

మండల కేంద్రంలో ప్రతీఏటా పూలాజీబాబా ధ్యాన మందిరం సమీపంలోని మైదానంలో హోలి పురస్కరించుకుని స్థానిక సర్పంచ్ పర్వ లావణ్య సాయన్న ఆధ్వర్యంలో సోమవారం కుస్తీ పోటీలను నిర్వహించనున్నారు. మొదట పిల్లలతో కుస్తీ పట్టించి కొబ్బరి కాయలను బహుమతి అందిస్తారు. తర్వాత యువకులు, ఆపై మల్లయోధులతో నిర్వహిస్తారు. ఫైనల్‌లో విజేతలకు రూ.20 వేల నగదుతోపాటు జ్ఞాపిక అందించి శాలువతో సత్కరిస్తారు.

ఏర్పాట్లు చేశాం



హోలీ సందర్భంగా నిర్వహించే కుస్తీ పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ పోటీలు వీక్షించే గ్రామాల నుంచి వచ్చే ప్రజల కోసం టెంట్లు, తాగునీటి వసతి కల్పించేలా చర్యలు తీసుకున్నాం.

– పర్వ సాయన్న
మాజీ సర్పంచ్ బజార్‌హత్నూర్

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

దిలావర్‌పూర్: జీవితంపై విరక్తితో ఒకరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై సుమాంజలి కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బెజ్జారం నరేశ్(36) డ్రైవర్‌గా పనిచేసేవాడు. గత కొంతకాలంగా ఎలాంటి పనులు చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపంతో జీవితంపై విరక్తి చెందాడు. శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి తల్లి, సోదరుడు ఉన్నారు.

గంజాయి పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్‌కు చెందిన ఖాలీం వద్ద గంజాయిని ఆదివారం పట్టుకున్నామని ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. గంజాయి విక్రయించేందుకు తీసుకెళ్తున్నారని పక్కా సమాచారంతో మార్గమధ్యలో సుభాష్‌నగర్ వంతెన సమీపంలో పట్టుకున్నామన్నారు. ఆయన వద్ద నుంచి కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రూ.2 లక్షల నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో పోలీసులు, అధికారులు



నర్సాపూర్(జి): పట్టుకున్న నగదుతో పోలీసులు

తలమడుగు: మండలంలోని తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల్లో రూ.2 లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. వారి కథనం ప్రకారం.. ముక్తార్ జాగిర్దార్ మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి ఆదిలాబాద్ వస్తున్న కారులో రూ.2 లక్షల నగదును తీసుకెళ్తున్నాడు. కారును ఆదివారం తనిఖీ చేసి ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును ఎన్నికల అధికారులు మాణిక్ ప్రభు, ఏఎస్సై సురేందర్, దత్తు, శేషరావు పట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఐ ఫణీందర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ. 50 వేలకు మించి నగదును తీసుకెళ్తే ఆధారాలు చూపించాలన్నారు. తలమడుగు ఎస్సై కె.ధనశ్రీ, ఏఎస్సై సురేందర్ ఉన్నారు.

నర్సాపూర్(జి): స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహించారు. బైంస్ల నర్సయ్య ముంబై నుంచి వెల్మల్ గ్రామానికి క్రెటా కారులో వెళ్తుండగా ఆపి తనిఖీ చేశారు. ఆయన వద్ద ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.75 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. సీజ్ చేసిన నగదును తదుపరి చర్యల నిమిత్తం సీటీఓ(కలెక్టర్ ఆఫీస్) నిర్మల్‌కి పంపినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రైల్వేస్టేషన్ ఆవరణలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..బెజ్జూర్ మండలం రెబ్బెన పంచాయతీ పరిధిలోని కొత్తగూడెంకు చెందిన గొనే శంకర్ (56) తాపీమేస్త్రీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల ప్రాంతాల్లో పనిచేస్తుండేవాడు. ఈనెల 9న ఇంటి నుంచి ఆదిలాబాద్‌లో పనిచేసేందుకు వచ్చిన ఆయన శనివారం రాత్రి రైల్వేస్టేషన్ ఆవరణలో మృతి చెంది ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమందించారు. వారు ఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతుడి జేబులో లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా గొనే శంకర్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కాగా, మృతుడి తలపై గాయాలు ఉండటంతో ఎవరో హత్యచేసి ఉంటారని భార్య పార్వతిభాయి అనుమానం వ్యక్తం చేసింది. దీంతో పోలీసులు హత్యకేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన వ్యక్తి శవం లభ్యం



పాషాబేగ్ (ఫైల్)

నర్సాపూర్(జి): మండలంలోని టెంబుర్ని గ్రామానికి చెందిన పశువుల కాపరి పాషాబేగ్ (54) ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో పడి శనివారం గల్లంతైన విషయం తెలిసిందే. తన భర్త ఆచూకీ కనిపించడం లేదని భార్య వాహెదా బేగం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం సుద్దవాగుకు వెళ్లగా మృతదేహం తేలి కనిపించింది. గ్రామస్తుల సహాయంతో బయటకు తీసి ఎస్సై హన్మాండ్లు ఆధ్వర్యంలో శవ పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

ప్రకృతి ఒడిలో భానుడి సోయగం

ఆదిలాబాద్‌రూరల్ మండలం ఖండాల అటవీప్రాంతంలో వేకువజామున భానుడి సోయగం ఆదివారం కనువిందు చేసింది. దట్టమైన అటవీప్రాంతంలో ప్రకృతి ఒడిలో నుంచి బయటకు వస్తున్నట్లుగా కన్పించిన ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

